www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 28 జూన్ 2023
5
పశ్చిమ గోదావరి



నేడు మున్సిపల్ అతిథిగృహం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో రూ.62 లక్షల వ్యయంతో పున్ణనిర్మించిన మున్సిపల్ అతిథి గృహాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం మధ్యాహ్నం ప్రారంభిస్తారని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ చెప్పారు. అనంతరం రామారావుపేటలో కోటీ 10 లక్షల ఖర్చుతో నిర్మించిన వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రంను మంత్రి ప్రారంభించి అక్కడ సభలో ప్రసంగిస్తారని తెలిపారు.



ప్రారంభించనున్న మున్సిపల్ అతిథి గృహం



సర్దుబాటు.. పోటు..

ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారం
2007 నుంచి19 వరకూ వినియోగించిన విద్యుత్ పై యూనిట్ 83 పైసలు వడ్డింపు
300 యూనిట్లకు రూ.21 వసూలు - ఆందోళనలో ప్రజానీకం

ప్రజాశక్తి - భీమవరం, వీరవాసరం

జిల్లా ప్రజలకు విద్యుత్ సర్దుబాటు పోటు పడింది. ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జిల పేరుతో ప్రజలపై మరింత భారాన్ని మోపింది. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజానీకం విద్యుత్ భారాలు మోయలేక సతమతమవుతున్నారు. కుటీర, చిన్న పరిశ్రమలతో పాటు ఎలక్ట్రికల్, జ్యూస్ జ్యూస్‌షాపులు వివిధ రంగాల షాపుల యాజమాన్యాలు, కార్మికులు, గృహ వినియోగదారులు చెప్పుకుంటూ పోతే పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా సర్దుబాటు ఛార్జీలు మోపుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కరెంటు ఛార్జీలను భారీగా పెంచేసింది. యూనిట్‌కు సగటున మూడు దశలుగా 83 పైసల చొప్పున పెంచి, 36. నెలలు వసూలు చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలోని నివాసగృహాలు మొదలుకుని వ్యవసాయ, కమర్షియల్, ఇండస్ట్రియల్, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయ సర్వీసుల వరకూ విద్యుత్ కనెక్షన్లన్నింటికీ కరెంటు ఛార్జీలను పెంచింది. ఆరు కేటగిరీలుగా విద్యుత్ కనెక్షన్లు విభజించారు. వీటిన్నింటి పరిధిలోని కనెక్షన్లన్నింటికీ ట్రూఅప్ ఛార్జీల పెంపును వర్తింపజేసింది. ప్రభుత్వానికి పేద, ధనికులనే తేడాలేకుండా ట్రూఅప్ ఛార్జీలు బాధేయడం విస్మయానికి గురిచేస్తోంది.

2014 నాటి భారం షురూ

2014 నుంచి 2019 వరకూ వచ్చిన ఆర్థిక నష్టాలను భర్తీ చేయడంలో భాగంగా ట్రూఅప్ ఛార్జీలను పెంచేసింది. దీనిలో భాగంగా వినియోగించిన విద్యుత్‌పై యూనిట్‌కు రూ.7 పైసలు చొప్పున ట్రూఅప్ ఛార్జీలు మోపి వసూలు చేస్తున్నారు. వాస్తవానికి ఒక గృహానికి 300 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తే వారికి సరాసరి రూ.21 ట్రూ అప్ పేరుతో అదనంగా వసూలు చేస్తున్నారు. గతంలో కరెంటు ఛార్జీల పెంపుదలను పరిశీలిస్తే శ్లాబ్ రేట్ల ప్రకారం పెంచేయడం తెలిసిందే. దీన్నిబట్టి గమనిస్తే పేదల విద్యుత్ వినియోగం పరిమితం. దీన్నిబట్టి పేదలపై భారం పరిమితంగానే ఉండేది. తాజా ట్రూ అప్ ఛార్జీల విషయంలో పేద, ధనిక కనెక్షన్లనే తారతమ్యం లేకుండా ఛార్జీల పెంపు అనివార్యమైంది. జిల్లాలోని కమర్షియల్, విద్యుత్ కనెక్షన్లపై ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేయడానికి బదులుగా కరెంటు కనెక్షన్లన్నింటికీ ఛార్జీలు పెంచడంపై విమర్శల వర్షం కురుస్తోంది.

మేలో రూ.3,500 కరెంటు బిల్లు వచ్చింది.. ★ ★ ★



పి.లక్ష్మి, గృహిణి శృంగవృక్షం

మాకు రెండు పోర్షన్ల ఇల్లు ఉంది. రూ.600 నుంచి రూ.700 వరకూ కరెంటు బిల్లు వచ్చేది. ప్రస్తుతం ఐదింతల బిల్లు వస్తోంది. ఏప్రిల్‌లో రూ.1,800 బిల్లు వచ్చింది. మేలో రూ.3,500 విద్యుత్ బిల్లు వచ్చింది. ఆ ఛార్జీలూ ఈ ఛార్జీలూ అని వందల రూపాయలు అదనంగా వేస్తున్నారు. ప్రతినెలా అధిక మొత్తంలో విద్యుత్ బిల్లు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నాం.

ప్రతినెలా భారమే.. ★ ★ ★



ఆర్. జ్యోతి, పెన్నాడ అగ్రహారం, చిరు ఉద్యోగి

గ్రామంలో చిన్న ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. గతంతో పోలిస్తే విద్యుత్తు బిల్లు ఎక్కువగా వస్తోంది. ట్రూప్ ఛార్జీలు వేసి అదనంగా వసూలు చేస్తున్నారు. భారంగా మారింది. విద్యుత్ శాఖ సిబ్బందిని అడిగితే ప్రతినెలా క్రమం తప్పకుండా ట్రూఅప్ ఛార్జీని చెల్లించాలని చెబుతున్నారు. చేసేదేమీ లేక భారమైనా చెల్లిస్తున్నాను.

విద్యుత్ ఉద్యమం తప్పదు..



జెఎన్‌వి.గోపాన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయి. ఏదో ఒక రూపంలో భారాలు వేసి ప్రజల నడ్డి విరుస్తున్నారు. గతంలో వినియోగించిన విద్యుత్‌కు ట్రూఅప్ ఛార్జీల పేరుతో అధికంగా కరెంటు ఛార్జీలు వసూలు చేయడం అత్యంత దుర్మార్గం. తక్షణం ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలి. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలి. లేని పక్షంలో అన్ని వర్గాల ప్రజలనూ సమీకరించి విద్యుత్ ఉద్యమం చేపడతాం.

ఈనెల రూ.800 అదనంగా వచ్చింది.. ★ ★ ★



సానబోయిన వేణు, వేండ్ర, చిరువ్యాపారి

గ్రామంలో కిరాణా, పాన్‌షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాను. గతంలో రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకూ షాపునకు బిల్లు నిమిత్తం వచ్చేది. మూడు, నాలుగు నెలల నుంచి సుమారు రూ.2 వేల వరకూ వస్తోంది. ప్రతి నెలా అదనంగా రూ.800 వరకూ బిల్లు రావడంతో ఇబ్బందులు పడుతున్నాం. ట్రూఅప్ ఛార్జీలు పేరుతో అధిక ఛార్జీలు వేయడం సరికాదు.

వ్యాపారం లేదు.. ఇంత బిల్లొస్తే ఎలా.. ★ ★ ★



రవల్లి మురళీకృష్ణ, చెప్పల వ్యాపారి, వీరవాసరం

గత నెలల్లో వరుసగా రూ.600, రూ.850 బిల్లు వచ్చింది. ఈనెల రూ.1120 వచ్చింది. నా వ్యాపారం అంతంతమాత్రమే. సరుకు అమ్మినా అమ్మకపోయినా కరంటు బిల్లు మాత్రం తప్పని సరిగా కట్టాల్సి వస్తోంది. గతంలో కరెంటు బిల్లు పెరగడమంటే ఎప్పుడో జరిగేది. ఇప్పుడు ప్రతి నెలా పెరగడం తప్ప తగ్గడం లేదు. యూనిట్ ధర తగ్గించాలి.

ఎలా బతుకుతాం.. ★ ★ ★



కామన పీర్లస్వామి, కూలి, వీరవాసరం

గత నెల రూ.150, ఈ నెల రూ.300 ఒక నెలలో సగానికి సగం పెరిగింది. కరెంటు బిల్లు వస్తోందంటే గుండె గుభేలుమంటోంది. ప్రతినెలా కరెంటు బిల్లు పెరిగితే నాలాంటి కూలి పనులు చేసుకునే వారు ఎలా బతుకుతారు. కరెంటు బిల్లు పెంపుదల విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి.

ఛార్జీలు పెంచేస్తున్నారు.. ★ ★ ★



గోపా జనార్ధనరావు, చిరు ప్రయివేటు ఉద్యోగి, వీరవాసరం

మొదటి సారి కరెంటు బిల్లు చెల్లించడానికి అప్పుచేయాల్సి వచ్చింది. గత నెల బిల్లు రూ.1600 వచ్చింది. ఈ నెల రూ.3,916 వచ్చింది. గత నెలలో వచ్చిందానికి రెట్టింపు పెరిగింది. నాణ్యమైన కరెంటు ఇవ్వడంలేదు. కాని బిల్లులు మాత్రం అంతకంతకూ పెరుగుతున్నాయి.

ఛార్జీల పెరుగుదల భారంగా ఉంది.. ★ ★ ★



కాకి రాజేష్, ఎలక్ట్రికల్ షాపు, వీరవాసరం

గత నెలలో రూ.600, ఈ నెలలో రూ.1,400 పైగా కరెంటు బిల్లు వచ్చింది. ఇప్పుడూ అవే యూనిట్లు వాడాం. బిల్లు మాత్రం రెట్టింపైంది. మీటరు రీడింగ్ తీయడంలో జాప్యం కూడా కరెంటు బిల్లులపై ప్రభావం చూపుతుంది. రీడింగ్ తీయడం ఆలస్యమైతే శ్లాబ్ మారిపోవడంతో యూనిట్ రేటు పెరిగిపోతుంది. వ్యాపారాలు అంతంతమాత్రంగా ఉన్న ప్రస్తుత కాలంలో కరెంటు బిల్లు పెరుగుదల భారంగా ఉంది.





ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్

30న భీమవరంలో పవన్ కళ్యాణ్ సభ

నేడు, రేపు ముఖ్యనేతలతో సమావేశం
మూడు రోజులపాటు భీమవరంలోనే జనసేనాని బస

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

ఈ నెల 30న భీమవరంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ సభ నిర్వహించనున్నారు. స్థానిక అంబేద్కర్ చౌక్‌లో భారీస్థాయిలో సభ నిర్వహించాలనే యోచనలో చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం, గురువారం ముఖ్య నేతలతో పవన్ సమావేశం కానున్నారు. మూడు రోజులపాటు భీమవరంలోని పవన్ బస చేసి పార్టీ నిర్మాణం, రాష్ట్ర రాజకీయాలపై చర్చలు జరిపి కీలక నిర్ణయాలు తీసుకుని ప్రకటనలు చేయనున్నారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో జనసేన వారాహి విజయయాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రధానంగా ఉభయగోదావరి జిల్లాలపై కేంద్రీకరించిన జనసేనాని తూర్పుగోదావరి జిల్లా అన్నవరం నుంచి ఈ నెల 14న వారాహి యాత్ర ప్రారంభించారు. కత్తిపూడి, పిఠాపురం, కాకినాడ, ముమ్మిడివరం, అమలాపురం, మలికిపురంలో పర్యటన చేసి బహిరంగ సభలు నిర్వహించి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రవేశించారు. నరసాపురంలో బహిరంగ సభ ముగించుకుని జనసేనాని భీమవరం చేరుకున్నారు. సోమవారం తూర్పుకాపుల సంఘం సభలో పవన్ పాల్గొని మాట్లాడిన అనంతరం జనసేన ఇన్‌ఛార్జీలతో రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ సమావేశమయ్యారు. దీనిలో ప్రధానంగా భీమవరంలో రాజకీయపరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నేతలు సూచించారు. ఈ నేపథ్యంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఈ నెల 30న సాయంత్రం ఐదు గంటలకు భీమవరం అంబేద్కర్ సెంటర్లో వారాహి విజయయాత్రలో భాగంగా బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ సభలో ప్రసంగిస్తారని, ఈ సభ చాలా ముఖ్యమైనదిగా భావించాలని దిశానిర్దేశం చేశారు. బహిరంగ సభ అనంతరం వారాహి విజయ యాత్రకు స్వల్ప విరామం ఇస్తామన్నారు. అనంతరం రెండో దశ వారాహి విజయ యాత్రపై చర్చించారు. ప్రధానంగా రూట్ మ్యాప్, జిల్లాలో ఏయే ప్రాంతాల్లో వారాహి యాత్ర సాగించాలనే దానిపై చర్చలు జరిపారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావుతోపాటు జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మహిళలపై రోజు రోజుకీ హింస పెరిగిపోతుందని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యాన మహిళలపై హింసకు వ్యతిరేకంగా మంగళవారం స్థానిక సీతారాంపేటలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ రోజురోజుకీ మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్భయ, దిశ వంటి చట్టాలెన్ని ఉన్నా అమలు సక్రమంగా లేకపోవడమే ఈ దుస్థితికి కారణమన్నారు. అమర్‌నాథ్‌ను దారుణంగా హత్య చేసి పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటన చాలా బాధాకరమని అన్నారు. ఈ దారుణానికి కచ్చితంగా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. భక్తి పేరుతో పూర్ణానంద స్వామీజీ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడటం క్షమించరాని నేరమని, తక్షణం వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలను లైంగికంగా వేధించడం, రెండో పౌరురాలిగా చూడటం మతతత్వ బిజెపి నేర్పుతుందని, మహిళలంతా దీన్ని వ్యతిరేకించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మహ్మద్ సరోజిని, మీసాల పావని, బి.యశోద తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు

సమస్యలు వింటూ.. కర్తవ్యం నిర్దేశిస్తూ...!


ఆరు గ్రామాల మీదుగా 19 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర
పోరుకేక బృందానికి వెల్లువెత్తిన సంఘీభావం
అడుగడుగునా ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు
అంతా కలిసికట్టుగా పోరాడుతామని సభల్లో నేతల పిలుపు



పాదయాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/కుక్కునూరు/జీలుగుమిల్లి/బుట్టాయగూడెం

నిర్వాసితుల సమస్యలను ఆలకిస్తూ.. కర్తవ్యం నిర్దేశిస్తూ జిల్లాలో రెండోరోజు మంగళవారం ఆరు గ్రామాల మీదుగా 19 కిలోమీటర్ల మేర పోలవరం పోరుకేక మహాపాదయాత్ర సాగింది. ఉదయం ఎనిమిది గంటలకు కుక్కునూరు మండలం దాచారంలో యాత్ర ప్రారంభమైంది. పది గంటలకు మండల కేంద్రమైన కుక్కునూరు చేరుకుంది. ఈ బృందానికి టిడిపి, జనసేన, సిపిఐ నాయకులు సంఘీభావం తెలుపుతూ స్వాగతం పలికారు. టిడిపి నాయకులు మునిశెట్టి నాగు, జనసేన నాయకులు మునిశెట్టి యుగంధర్ వి.శ్రీనివాసరావుకు నిర్వాసితుల సమస్యలను వివరించారు. స్థానిక నిర్వాసితులు ఏ విధంగా ఇబ్బందులు పడుతున్నారో.. పరిహారం అందకపోవడం, ఇళ్లు నిర్మించకపోవడం వంటి సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం జరిగిన సభలో వీరంతా పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ కుక్కునూరు చేరుకుని పాదయాత్ర బృందానికి సంఘీభావం తెలపడమే కాకుండా రోజుంతా పాదయాత్రలో పాల్గొన్నారు. మధ్యాహ్నం జీలుగుమిల్లి మండలంలోని రాచన్నగూడేనికి యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో పలువురు నేతలు ప్రసంగించారు.



సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ముంపులో లక్షా ఐదు వేల కుటుంబాలు
మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

పోలవరంలో ముంపునకు గురవుతున్న ఎనిమిది మండలాల్లో దాదాపు లక్షా ఐదు వేల కుటంబాలు నిర్వాసితులవుతున్నాయని మంతెన సీతారాం తెలిపారు. చెట్టుకొకరు.. పుట్టకొకరు అన్నట్లుగా వారి పరిస్థితి తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు భూమికి భూమి, 18 ఏళ్లు నిండిన వారికి పునరావాస పరిహారం, వ్యవసాయ కూలీలకు ప్యాకేజీ, కుటుంబానికో ఉద్యోగం ఇవ్వాల్సి ఉందన్నారు. సిఎం జగన్ మాత్రం ఏమీ చేయడం లేదన్నారు. రాచన్నగూడెం పోరాటాల గడ్డ అని, నిర్వాసితులకు అండగా నిలవాలని అన్నారు. మనం ఎకరా భూమి పోతే చాలా బాధపడతామని, నిర్వాసితులు సర్వం కోల్పోతున్నారని అన్నారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం చేస్తూ నిర్వాసితులను ముంచేస్తున్నారన్నారు. గతేడాది వచ్చిన గోదావరి వరద మోడీ, జగన్ తెచ్చిందేనన్నారు. మళ్లీ వరదలు వచ్చే అవకాశం ఉందని, ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది మాదిరి అడవులు, కొండల పాలు చేయకుండా వెంటనే పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని, వరద పరిహారం ఇవ్వాలని కోరారు.

బతికేందుకు దారి చూపేందుకే పోరుకేక
డి.రమాదేవి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

పోలవరం పోరుకేక పాదయాత్ర మణులు, మాణిక్యాల కోసం జరగడం లేదని, నిర్వాసితులు బతికేందుకు దారిచూపాలని కోరుతుందని డి.రమాదేవి అన్నారు. లక్షల కుటుంబాలను ముంచి ఎవరికి నీరిస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టు బాధ్యత మాది అని చెప్పిన కేంద్రం పూర్తిగా నిధులివ్వడం లేదన్నారు. కేంద్రంలో అమానవీయ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అడగలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. 90 శాతం హామీలు అమలు చేశామని చెబుతున్న జగన్ ముంపు మండలాల పరిస్థితి చెప్పాలన్నారు. అమ్మఒడి, వృద్ధాప్య పింఛను ఇస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. గతేడాది వరదలకు ఇక్కడి ప్రజలు దుర్భర పరిస్థితి ఎదుర్కొన్నారన్నారు. ప్రాజెక్టు కట్టి తెచ్చిన వరద అని అన్నారు. ఇప్పటి వరకూ పదిశాతం కూడా పరిహారం ఇవ్వలేదన్నారు. వచ్చేనెల నాలుగో తేదీన జరిగే సభకు అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.

నిర్వాసితులకు అండగా నిలబడదాం
ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

అంతా పోలవరం నిర్వాసితులకు అండగా నిలబడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. జీలుగుమిల్లి మండలంలో నిర్వాసితులకు అత్యధిక కాలనీలు నిర్మిస్తున్నారని, వారందరికీ మనం అండగా ఉండాలని కోరారు. జాతీయ ప్రాజెక్టుగా ఉన్న పోలవరం నిర్వాసితులకు దిక్కులేదని, జీలుగుమిల్లి మండలంలో బంగారుపాపమ్మ ప్రాజెక్టు నిర్వాసితుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. జీలుగుమిల్లిలో ఆయుధ ఫ్యాక్టరీ నిర్మిస్తే జీలుగుమిల్లి, వంకావారిగూడెం పంచాయతీలు ఖాళీ చేయాల్సి వస్తుందన్నారు. దీన్ని అందరూ తిప్పికొట్టాలన్నారు. 1/70 చట్టం గిరిజనేతరులకు ఎలాంటి నష్టమూ ఉండదన్నారు. గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య విబేధాలు సృష్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు అధ్యక్షత వహించారు. సంఘీభావం ప్రకటించిన తలసాని శ్రీనివాస్ యాదవ్ నిర్వాసితుల సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, అల్లూరి జిల్లా కార్యదర్శి బి.కిరణ్, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, నాయకులు తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, వాణిశ్రీ, రాంబాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నేత ప్రసన్న కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర నేత రాము, ప్రజానాట్య మండలి రాష్ట్ర నేత మంగరాజు పాల్గొన్నారు.







మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నేతలు లోకనాథం, రమాదేవి, మంతెన సీతారాం



ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్

నేడు యాత్ర సాగేదిలా

జీలుగుమిల్లి: పోలవరం పోరుకేక మహాపాదయాత్ర మూడో రోజు బుధవారం మండలంలోని కామయ్యపాలెం నుంచి వంకావారిగూడెం, మడకంవారిగూడెం, కాలనీలు, జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం కాలనీలు మీదుగా జీలుగుమిల్లి మండలంలోని కొరుటూరు కాలనీలకు చేరుకుని రాత్రి బస చేయనుంది.

పోలవరం ఉపయాత్ర పోలవరంలో బయల్దేరి ఇటుకలకోట, వింజరం, కాలనీలు, దొండపూడి మీదుగా కొంద్రుకోట కాలనీ చేరుకుని రాత్రి బస చేయనుంది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెంటపాడు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని కోరుతూ మంగళశారం ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో అంగన్‌వాడీ యూనియన్ నేతలు కె.రఘూన్సీ, బి.రామకోటి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరుపు రంగారావు మాట్లాడారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వేతనాలిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని, 2017 నుంచి ఉన్న పెండింగ్ బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జె.శ్యామలాకుమారి, ఆర్.అనురాధ, పి.విజయలక్ష్మి, ఎ.గంగాభవాని పాల్గొన్నారు.

ఉండి : అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను తీర్చాలని కలెక్టర్ కార్యాలయాల వద్ద జులై 10వ తేదీన జరిగే ఆందోళనలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి హసీనా బేగం పిలుపునిచ్చారు. పెద్దపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో హసీనా బేగం పాల్గొని మాట్లాడారు. సిఎం జగన్మోహన్ రెడ్డి తెలంగాణ కంటే అధికంగా వేతనాలు ఇస్తామని ఇచ్చిన హామీ నీటి మీద రాతలా మిగిలిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంగన్వాడీలకు గ్రాడ్యుటీ పెంచాలని వారు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల న్యాయమైన కోరికలను తీర్చేందుకు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జులై 10వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ఆందోళనలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్, మండల కార్యదర్శి కొట్టాడ వెంకటేశ్వరరావు, అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్లు పాల్గొన్నారు.



పెంటపాడులో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

రోడ్డు నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రుల ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పట్టణంలోని పీచుపాలెం ఆదిత్య, చైతన్య పాఠశాలలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు మంగళవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. పాఠశాలకు వెళ్లే రోడ్డు గోతులతో అధ్వానంగా ఉందని, తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందన్నారు. కొన్నేళ్ల నుంచి సమస్యను ఆదిత్య, చైతన్య విద్యా సంస్థల యాజమాన్యాలకు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు చెప్పినా ఫలితం లేదన్నారు. దీంతో చేసేది లేక ధర్నా కార్యక్రమం చేపట్టామన్నారు. వెంటనే రోడ్డు నిర్మాణానికి పాఠశాలల యాజమాన్యాలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు. ధర్నాకు కౌన్సిలర్ బొమ్మిడి సూర్యకుమారి కృష్ణ మూర్తి మద్దతుగా తెలిపారు.

ఇంటింటా పక్కాగా సర్వే చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటా సర్వే పక్కాగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి జగనన్న సురక్ష, గృహ నిర్మాణం, మనబడి - నాడు నేడు, జగనన్నకు చెబుదాం, పంచాయతీరాజ్ భవనాలు, జాతీయ ఉపాధి హామీ పనుల తదితర అంశాలను అధికారులు, సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికి సర్వే ఏ విధంగా చేస్తున్నారు, గ్రామాల్లో ఎన్ని ఇళ్ల పూర్తి చేశారు, ఏయే సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, మండలాల వారీగా ఆమె అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీని నమోదు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జులై 1వ తేదీ నుండి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయం వద్ద ప్రత్యేక క్యాంపుల్లో ప్రజలు అడిగిన ధ్రువ పత్రాలను అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, డిఆర్‌డిఎ పి.డి వేణు గోపాల్, డ్వామా పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు, ఎస్ఎస్ఎపిఒ పి.శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి - పెనుమంట్ర

నరసాపురం వారాహి యాత్రలో రాష్ట్ర ప్రభుత్వంపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను వెలగలేరుకు చెందిన రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవ రెడ్డి మంగళవారం ఖండించారు. గత ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయిన పవన్‌కు 34 సీట్లు ఏ విధంగా వస్తాయని అనుకున్నారని విమర్శించారు. ఉభయగోదావరి జిల్లాలు వైసిపికి పట్టుకొమ్మలు వంటివన్నారు. ఇక్కడ జగన్మోహన్ రెడ్డి పాలన ఎంతో పారదర్శకంగా జరుగుతుందని, పవన్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శించారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి ఎంత జరిగిందో ప్రజలు చూస్తున్నారని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికే ప్రజలు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు.

పారిశుధ్య నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి - గణపవరం

గ్రామంలో పారిశుధ్య నిర్మూలన అందరి బాధ్యతని ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి అన్నారు. మంగళవారం గణపవరం పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఎస్ఎస్‌జి 23 కార్యక్రమంలో భాగంగా విలేజ్ శానిటేషన్ హెల్త్ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి గ్రామంలోని మూరా అంగంకారం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అధికారులు స్థానికులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి పి.సత్యనారాయణ, వైఎస్ఆర్ నాయకులు దండు రాము, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇకె.హరనాథ్, రాజు, పంచాయతీ కార్యదర్శి డి.శివప్రసాద్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాల స్థాపించడం జరిగిందని, దీనికి దాతలు ఎంతో సహకారం అందిస్తున్నారని గొల్లవానితిప్ప మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.ఎర్రిజాదిరాజ అన్నారు. గొల్లవానితిప్ప మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 90 మంది విద్యార్థులకు వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు పిలువైన పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశారు. గ్రామ పెద్ద వి.కృష్ణంరాజు మాట్లాడుతూ దొంగలచలవేరిని సాధించి విజ్ఞాన విద్య అన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు ఆరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గునిశెట్టి కృష్ణమూర్తి, బి.భారతి, విజయ భారతి, వి.నరేంద్ర పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కోర్సుల నిర్వహణలో ఎస్ఆర్‌కెఆర్‌కు ఎ గ్రేడ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెన్నయ్ ఐఐటి నుంచి ఎన్‌పిటిఇఎల్ అండ్ స్వయం ఆన్‌లైన్ కోర్సుల నిర్వహణలో జాతీయస్థాయిలో ఎ గ్రేడ్ అందుకుందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ చెప్పారు. ఈ నెల 24వ తేదీన చెన్నయ్ ఐఐటిలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఐఐటి అకడమిక్ డీన్ ప్రొఫెసర్ ప్రతాప్ హరిదాస్ కళాశాలకు ఈ ర్యాంకు అందించారని ఆయన మంగళవారం చెప్పారు. దీన్ని కళాశాల టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్ గోపాల్ కృష్ణమూర్తి అందుకున్నారన్నారు. దింతోపాటు కళాశాల ఎన్‌పిటిఇఎల్ సెంటర్ ద్వారా అత్యుత్తమ సేవలందించినందుకు టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తికి ప్రత్యేక ప్రశంసాపత్రం అందించారని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కె.నరేష్‌బాబు, ఎన్‌పిటిఇఎల్ లోకల్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి మాట్లాడారు. దేశంలో ఎన్‌పిటిఇఎల్ కోర్సులు నిర్వహిస్తున్న 100 సెంటర్లు ఎంపిక చేసి వారికి ఏ గ్రేడ్ ప్రకటించారన్నారు. అందులో ఎస్ఆర్‌కెఆర్ కళాశాల ఒకటి కావడం తమకు గర్వకారణంగా ఉందన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామ సచివాలయంలో వ్యవసాయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మంగా ఐశ్వర్య 2019లో విధి నిర్వహణలో ఉండగా యాక్సిడెంట్ అయ్యింది. ఆమె తండ్రి నారాయణరాజుకు మంగళవారం ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు చేతుల మీదుగా సిఎం సహాయ నిధి రూ.5లక్షల చెక్కు అందించినట్లు ఆత్తిగ సర్పంచి తమనంపూడి వీరిరెడ్డి అన్నారు. ఆయనతో పాటు పెనుమంట్ర ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, పెనుమంట్ర వైసిపి గ్రామాధ్యక్షులు సుధీర్‌రెడ్డి, తాడిపత్రి ప్రసన్నకుమార్, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కొవ్వూరి చిన్నారెడ్డి పాల్గొన్నారు.

నష్టపరిహారం కోసం పోరాడతాం

తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ రాజు

ప్రజాశక్తి - యలమంచిలి

రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతులు తాము పండించిన పంటను అమ్ముకోవాలంటే మిల్లర్లకు ఎదురు డబ్బులు కట్టి ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి రుద్రరాజు సత్యనారాయణ రాజు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పంట నష్టం నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రాజు మాట్లాడుతూ గతంలో రైతులు తాము పండించిన పంటను స్వతంత్రంగా అమ్ముకునే పరిస్థితి ఉండేదని, దీనిద్వారా సకాలంలో డబ్బులు చేతికి అందడంతో ఆ సొమ్ముతో మరల రెండో పంట వేసుకునే అవకాశం ఉండేదని తెలిపారు. అయితే ఇప్పటి ప్రభుత్వం నూతన విధానం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు ఎంత మేర నష్టపోయారో ఆ నష్టాన్ని గ్రామాల వారీగా జాబితాలు తయారుచేసి తమ అధినేత చంద్రబాబు ఆదేశం మేరకు రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడి నష్టపరిహారాన్ని రైతులకు ఇప్పించే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబారు రామకృష్ణంరాజు, రుద్రరాజు కృష్ణంరాజు, రుద్రరాజు కుమార్‌రాజు, చిట్టి రాజు, ముదునూరి రామలింగరాజు పాల్గొన్నారు.

వాహనదారులు హద్దు మీరితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం రోడ్లపై ద్విచక్ర వాహనదారులు అతివేగంగా నడిపినా, సైలెన్సర్ లేకుండా, నంబర్ ప్లేట్ లేకుండా తిరిగినా ఆయా వాహనదారుల వాహనాలను సీజ్ చేస్తామని డిఎస్‌పి బందారు శ్రీనాథ్ అన్నారు. మంగళవారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అతివేగంగా నడపడం, అధిక శబ్దం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటువంటి వారి ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

సిపిఎం నేత కడలి సూర్యారావు కన్నుమూత

ప్రజాశక్తి - ఆచంట, పోడూరు


సూర్యారావు (ఫైల్‌ఫోటో)

పోడూరు మండలం పండితవిల్లూరు గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు కడలి సూర్యారావు (86) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో ఒక కుమారుడు కొంతకాలం క్రితం మృతి చెందారు. సూర్యారావు భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, ఆచంట మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, నేతలు పిల్లి ప్రసాద్, సూర్నీడి వెంకటేశ్వరరావు, వద్దిపర్తి అంజిబాబు, సిర్రా నర్సింహమూర్తి, ఎస్ఎఎస్.శర్మ, తలుపూరి బుల్లబ్బాయి, కేతా పద్మజ, మూడే వెంకటేష్, బొంతు శ్రీను, మల్లుల గణపతి తదితరులు సందర్శించి నివాళులర్పించారు. పార్టీ జెండా కప్పి జోహార్లు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సూర్యారావు అంతిమయాత్ర మంగళవారం ఉదయం నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస విడిచే వరకూ నికరంగా నిలబడిన ప్రజానేత కడలి సూర్యారావు అని కొనియాడారు. వ్యవసాయ కార్మికులు, రైతుల సమస్యలపై నిరంతరం పని చేశారని గుర్తు చేశారు. ఉదయమే ప్రజాశక్తి పత్రిక కోసం పరితపించేవారని, అందులో వ్యాసాలు చదివి నలుగురికి అర్థమయ్యే రీతిలో వివరించేవారని తెలిపారు. సూర్యారావు మృతి పట్ల సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్‌సి రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్), సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, ప్రజాసంఘాల నాయకులు వలవల శ్రీరామ్మూర్తి, జోషి, క్రాంతికుమార్, కొప్పర్తి నరసింహమూర్తి, మల్లుల సూర్యనారాయణ, ప్రజాశక్తి జిల్లా కన్వీనర్ వివిఎస్ఎస్‌వి.ప్రసాద్ తదితరులు సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.


సూర్యారావు అంతిమయాత్రలో నేతలు

30న మహాధర్నాకు రైతులు తరలిరావాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న విజయవాడలో జరిగే మహా ధర్నాకు రైతులందరూ రావాలని విజ్ఞప్తి చేస్తూ వేములదీవిలో మంగళవారం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ మేరకు రాజులంక దర్బరేవు, సారవ, లక్ష్మణేశ్వరం, పెదలంక, మర్రితిప్ప గ్రామాల్లో కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మరింత భారం వేసి వారిని మోసగించాయన్నారు. అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్రంలో ఉన్న మోడీ రైతులకు స్వామినాథన్ కమిషన్ చెప్పిన ప్రకారం మద్దతు ధరలు కల్పిస్తామని, వాణిజ్య పంటలకు ఎక్స్పోర్ట్ కల్పిస్తామని చెప్పిన మోడీ వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం కోసం ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ ఆక్వా రైతులను ఆదుకుంటానని, ఆక్వారంగాన్ని పైకి తీసుకొస్తానని, ఉచిత కరెంటు ఇస్తానని అనేక అబద్ధాలు చెప్పాడని విమర్శించారు. ఆక్వాకు కనీస మద్దతు ధర 100 కౌంట్‌కు 250 రూపాయలు ఇవ్వాలని, ఉచిత కరెంటు కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేపు జరిగే మహా ధర్నాలో ఈ విషయాలన్నీ నాయకులు మాట్లాడతారని, అనంతరం జిల్లాల వారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి గుత్తుల శ్రీరామచంద్రుడు, కౌరు సత్యనారాయణ, బుల్లబ్బులు, కేతా వెంకటేశ్వరరావు,కె.యువరాజు, కౌరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి

భీమవరం రూరల్: దళితులు, గిరిజనులు, దళిత క్రైస్తవులు, మైనార్టీలు, జర్నలిస్టులు, మహిళలు, పిల్లలపై రోజురోజుకూ పెరిగిపోతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను అరికట్టాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా దళిత హక్కుల పోరాట సమితి, సిపిఐ ఆధ్వర్యాన మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి జాయింట్ కలెక్టర్ ఎస్.సుందరరామిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరిగిన అకృత్యాలపై చర్యలు తీసుకోవడంలో అటు ప్రభుత్వం, ఇటు పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై పరువు హత్యలు జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమం కోసం గత ప్రభుత్వాలు అమలు చేసిన 27 పథకాలు అమలు కావడంలేదని నాయకులు గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, నాయకులు ఎస్.రాంబాబు, చింతాడ ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రీసర్వే పనులకు రైతులు సహకరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - అత్తిలి

రీ సర్వే పనులకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. బల్లిపాడు గ్రామంలో రీసర్వే పనులను జిల్లా కలెక్టరు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీసర్వే ప్రక్రియకు హాజరుకాని రైతులకు నోటీసులు పంపిస్తున్నారా లేదా అని రికార్డులను పరిశీలించారు. రీసర్వే చేయడం వల్ల ఉపయోగాల గురించి రైతులకు పూర్తి అవగాహన కలిగేలా వివరించారు. రైతులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసి, రీసర్వేకు రైతులు పూర్తిగా సహకరించాలని కోరారు. అనంతరం ఒఆర్ఐకి భూమిపై ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయా లేవా అని స్వయంగా రోవరుతో పరిశీలించారు. శివారు భూములకు సాగునీరు అందట్లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కలెక్టరు ఇరిగేషన్ శాఖ అధికారులను, తహశీల్దారును సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వే రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఒఆర్ఐ మ్యాప్‌లను పరిశీలించి దీనిలో ఏ నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అత్తిలి మండలంలోని 14 గ్రామాల్లో రీసర్వే పనులు చేపట్టగా గుమ్మంపాడు గ్రామం రీసర్వే పూర్తయ్యిందని, మిగతా గ్రామాల్లో పనులు మొదలు పెట్టామని తెలిపారు. మిగతా 13 గ్రామాల్లో రీ సర్వే పనులను రైతుల భాగస్వామ్యంతో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎటువంటి పొరపాట్లకు తావీయని విధంగా త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు అధికార్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి కె.జాషువ, తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు, ఎండిఒ వివివి రామారావు, గ్రామ సర్పంచి కసిరెడ్డి బాలాజీ, సచివాలయం, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు..

నేడు, రేపు పంట మునిగింది.. పరిహారం ఇవ్వండి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఈ నెల 28, 29 తేదీల్లో ఏరియాల వారీగా ప్రతి గ్రామంలో పంట మునిగింది.. పరిహారం ఇవ్వండి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టిడిపి మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్ తెలిపారు. లంకలకోడేరులో టిడిపి అధ్యక్షులు కోడి విజయభాస్కర్ విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు కష్టపడి పంట పండిస్తుంటే ఆ పంట మిల్లుకు చేరేసరికి నాలుగు కేజీలు, రెండు కేజీలు, కేజీ అంటూ తరుగు తీస్తున్నారన్నారు. ఒక్కో రైతు నుండి రూ.నాలుగు వేల నుండి రూ.20 వేల వరకు వసూలు చేస్తేనే గాని ధాన్యం దింపుకునే పరిస్థితి లేదన్నారు. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ పాముల రజిని కుమార్, అందే కోటి వీరభద్రం, అంగర వీరభద్ర కుమార్, ఎంపిటిసి సాగా సత్యనారాయణ, సర్పంచి చొప్పల రజిని, పెన్మత్స సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఎక్కడ నుంచి పోటీచేయాలో ఆయనకే తెలీదు

పవన్ కళ్యాణ్‌పై ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు వ్యాఖ్యలు

ప్రజాశక్తి - ఆచంట

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది ఆయనకే నికరం లేదని, గెలుపు ఓటములు ప్రజలే నిర్ణయిస్తారని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథ రాజు విమర్శించారు. మంగళవారం పోడూరు మండలం తూర్పు పాలెం వైసిపి కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్ కళ్యాణ్ సినిమా డైలాగులు వల్లించడం కాదని, ఎన్నికల బరిలోకి రండి సొంత జిల్లా నుంచి పోటీ చేయండి అని సవాల్ విసిరారు. డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ మీద పోటీ చేస్తారా, లేక మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మీద పోటీ చేస్తారా, లేక ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మీద చేస్తారా లేకపోతే ఆచంటలో తనపై పోటీ చేస్తారా పవన్ నిర్ణయించుకోవాలన్నారు. తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలో పవన్ కళ్యాణ్ యాత్ర చేపట్టి ప్రతి నియోజక వర్గంలో బహిరంగ సభలు పెడుతున్నారు ప్రజల వద్దకు వెళ్ళి అధికార ప్రభుత్వాలు చేసిన పనులను వేలెత్తి చూపే అధికారం ప్రతిపక్ష పార్టీకి ఎప్పుడు ఉంటుందని తెలిపారు. సినిమాల్లో డైలాగులు చెప్పొద్దన్నారు. భీమవరంలో గానీ నరసాపురంలో గానీ ఆచంటలో గాని పోటీ చేసి నెగ్గి చూపించండని తెలిపారు.

ఉపాధి హామీ పరిరక్షణకు పోరాడాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడం కోసం వ్యవసాయ కూలీలంతా పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు పిలుపునిచ్చారు. ఉపాధి పర్యటనలో భాగంగా మంగళవారం తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్లలోని గాంధీనగర్ వద్ద పని ప్రదేశంలో పర్యటించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరి నాట్లు ప్రారంభ దశలోనే ఇతర రాష్ట్రాల నుండి, ఇతర ప్రాంతాల నుండి వలస కూలీలు వస్తున్నారని, దీంతో ఇక్కడ కూలీలకు పనులు లేకుండా పోతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఉపాధి హామీ పనులే తమకు దిక్కని, ఈ పనులు కూడా లేకపోతే తాము బతకడం కష్టమని కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఒకపక్క వ్యవసాయంలో యంత్రాలు, మరోపక్క ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుండి వస్తున్న వలస కూలీలతో ఇక్కడ వ్యవసాయ కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో కూలీలంతా ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడం కోసం నిరంతరం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. తక్షణమే వేతన బకాయిలు ఇవ్వాలని కూలీలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి సావిత్రి, పోలాసు దుర్గాప్రసాద్, పి.ఉమాదేవి, మధురబోయిన లక్ష్మి, మారిశెట్టి శ్రీను, ఎం.వరలక్ష్మి, ఎం.సాయి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం

ప్రకృతి వైపరీత్యాలు, పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడవచ్చునని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం ప్రకృతి వైపరీత్యాలు, పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలపై ముందస్తు జాగ్రత్తలపై వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎన్‌డిఆర్ఎఫ్ అధికారితో డిఆర్ఒ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం ఉంటేనే విపత్తులు ఎదుర్కొని ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడగలమన్నారు. సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ గతానుభవాలు దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వరి, ఉద్యాన పంటలు, మూగ జీవాల సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎన్‌డిఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ పింటు నంది, జిల్లా అగ్నిమాపక దళ అధికారి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

షాపుల్లో చోరీ..

రూ.2.40 లక్షలు నగదు, కాసు బంగారం అపహరణ

ఉండి: ఉండి, ఆకివీడు రహదారిలోని మెయిన్ సెంటర్లో ఉన్న వాసవి ఐరన్, హార్డ్ వేర్, పెయింట్, అక్షయ మానస మెడికల్స్, ధనలక్ష్మి ఐరన్ సిమెంట్, మహాలక్ష్మి కిరాణా, ఆర్కె షూ మార్ట్ షాపుల్లో సోమవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. వాటిలో ధనలక్ష్మి ఐరన్ సిమెంట్ షాపులో రూ.18 వేల నగదు దొంగిలించగా, ఆర్‌కె షూ మార్ట్‌లో సుమారు రెండు లక్షల 30 వేల రూపాయల నగదు, కాసు బంగారం, 25 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. మిగిలిన షాపుల్లో దొంగలు విఫలయత్నం చేసినట్లు షాపు యజమానులు తెలిపారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ అర్ధరాత్రి పోలీస్ పహారా సరిగా నిర్వర్తించట్లేదని వాపోయారు. పోలీస్‌స్టేషన్లో సిబ్బంది కొరత కాగా సోమవారం సాయంత్రం నరసాపురం పవన్ కళ్యాణ్ బందోబస్తు నిమిత్తం కొంతమంది అక్కడికి వెళ్లారని దీంతో పోలీస్ సిబ్బంది పూర్తిస్థాయిలో లేదని దీంతో దొంగలు అదును చూసుకుని రెచ్చిపోయారని తెలిపారు. ఎస్ఐ కె.గంగాధర్‌రావు మాట్లాడుతూ ధనలక్ష్మి ఐరన్ సిమెంట్ షాప్‌లో సీసీ కెమెరా ఉందని, పుటేజ్‌ను బట్టి తొందర్లోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

ఘనంగా రాష్ట్రస్థాయి సంఖ్యాకోత్సవ్

ప్రజాశక్తి - తణుకురూరల్

రాష్ట్రస్థాయి సంఖ్యాకోత్సవ్-23 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. సోమవారం ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్)లో సంఖ్యాకోత్సవ్-23 కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. తొలుత కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యషారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ మాట్లాడుతూ క్విజ్, జస్ట్ ఎమినిట్, పేపర్ ప్రజెంటేషన్, ఫన్‌స్టాట్ పోటీలు నిర్వహించామన్నారు. క్విజ్‌లో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల తణుకు, ప్రథమ బహుమతి, ఆదిత్య డిగ్రీ కాలేజ్ తాడేపల్లిగూడెం, ద్వితీయ బహుమతి, ఆదిత్య డిగ్రీ కాలేజ్ కాకినాడ, తృతీయ బహుమతి సాధించారన్నారు. పిపిటిలో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల తణుకు, ప్రథమ బహుమతి, ఆదిత్య డిగ్రీ కాలేజ్ కాకినాడ, ద్వితీయ బహుమతి, ఆదిత్య డిగ్రీ కాలేజ్ తాడేపల్లిగూడెం, తృతీయ బహుమతి సాధించారన్నారు. జస్ట్ ఏ మినిట్‌లో ఆదిత్య డిగ్రీ కాలేజ్ కాకినాడ, ప్రథమ బహుమతి, ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల తణుకు, ద్వితీయ బహుమతి, వైఎన్ కాలేజ్ నరసాపురం, తృతీయ బహుమతి సాధించారన్నారు. ఫన్‌స్టాట్ లో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల తణుకు, ప్రథమ బహుమతి, ఆదిత్య డిగ్రీ కాలేజ్ తాడేపల్లిగూడెం ద్వితీయ బహుమతి, ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల తణుకు, తృతీయ బహుమతి సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సిహెచ్ నాగరాజు, ఎ.దీప్తి వివిధ కళాశాల నుండి వచ్చిన అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యకు వేల కోట్లు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, విద్యార్థులు, తల్లిదండ్రులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎవిఎస్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం విష్ణుమూర్తి కోరారు. హైస్కూల్లో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, గోరుముద్ద, ఇంగ్లీష్ మీడియంలో బోధన నిర్వహిస్తోందన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కోట్ల దుర్గాభవాని పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

సర్పంచి బోణం భాగ్యశ్రీ శివకుమార్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని కోమటిగుంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.భోగరాజు మంగళవారం తెలిపారు. కోమటిగుంట, సూర్యారావుపేట పాఠశాలలకు రూ.5 వేలు విలువైన నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించిన జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశామన్నారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యనందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

సత్యనారాయణరాజుకు నివాళి

ప్రజాశక్తి - గణపవరం

బైరాజు ఫౌండేషన్ అధినేత బైరాజు సత్యనారాయణరాజు 23 వర్ధంతి మంగళవారం కాశిపాడులో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ రాజు చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వికాస్ కమిటీ ఛైర్మన్ జంపన సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ సత్యనారాయణ రాజు రాష్ట్రంలో గ్రామీణ ప్రజలకు విద్య, వైద్యం అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో కె.కేశవరావు, యు.నాగేశ్వరరావు, టి.పద్మారావు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సి పరిధిలోని అన్ని సచివాలయాల్లో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 26వ తేదీ నుంచి జులై 16వ తేదీ వరకూ కుష్టు లక్షణాలు గల వారిని గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేస్తున్నామని డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ తెలియజేశారు. ఈ సర్వేలో స్పర్శ లేని రాగి, రంగు మచ్చలు గాని, కనురెప్పలు మూతలు పడకపోవడం, నడిచినప్పుడు కాళ్ళ చెప్పులు జారిపోవటం తదితర లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది వచ్చినప్పుడు ఏ మచ్చలు ఉన్నా చూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్యజీవన్, డిపిఎంఒ జక్కంపూడి రాంప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారులు గుడాల హరిబాబు, కె.ప్రభాకర్, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.